క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధి దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో భాద్రపద మాస శుద్ధ దశమి పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన


శాంతినగర్ వినాయక మండపం వద్ద ఆకట్టుకుంటున్న దీపారాధన

గోపాలపట్నం: శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో శాంతినగర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు. శివలింగ సహిత వినాయక బొమ్మపై 1008 దీపాలతో అలంకరించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు హాజరై తొలి దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్ననాయకుడు అందరికీ మంచి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్, 52వ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతి, శాంతినగర్ యువకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రైతు బజారులో అన్నసమారాధన


వినాయక మండపం వద్ద పూజలు చేస్తున్న వ్యవసాయ మార్కెటింగ్ అధికారి యాసిన్

గోపాలపట్నం: మర్రిపాలెం రైతు బజారులో శుక్రవారం నిర్వహించిన అన్న సమారాధనను వ్యవసాయ మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ ప్రారంభించారు. తొలుత వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రైతులు, వినియోగదారులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో మర్రిపాలెం వుడాలేఅవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు, వినియోగదారుల సలహాకమిటీ సభ్యులు వి. సూర్యనారాయణ, బుజ్జి, సూర్యనారాయణ, రైతు బజారు ఎస్టేట్ అధికారి కె. వరహాలు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

'ఎగుమతి వ్యాపారం'పై సర్టిఫికెట్ కోర్సు

విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో 'ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి'అన్న అంశంపై ఐదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పి.వైదేహి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సెషన్లు ఉంటాయని వివరించారు. కొత్త వ్యాపారవేత్తలను ఎగుమతి వ్యాపారంలోకి ప్రోత్సహించేందుకు ప్రముఖ సంస్థల నుంచి నిపుణులు, కన్సల్టెంట్ల ద్వారా ఈ సెషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మర్చంట్ ఎగుమతిదారులు, తయారీదారులు, సర్వీస్ ప్రొవైడర్లు, ఎస్ఎంఈలు, వ్యాపారులు, భావి ఎగుమతిదారులు/వ్యాపారవేత్తలు ఈ ఆన్‌లైన్ ప్రోగ్రాంకు హాజరుకావచ్చన్నారు.

అమ్మో.. ఆ ఆస్పత్రి!


చీకటి మయంగా గుల్లలపాలెం 30 పడకల ఆస్పత్రి


అంధకారంలో ఆస్పత్రి ముఖద్వారం

- అంధకారంలో ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి
- ఆవరణలో ఆకతాయిల బెడద
- నైట్ వాచ్‌మన్‌పై దాడి
- రాత్రిపూట వైద్యానికి వెళ్లాలంటే హడల్
- పోలీసులు చర్యలు తీసుకోవాలని రోగుల డిమాండ్

ప్రజలకు చేరువలో వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన గుల్లలపాలెం 30 పడకల ఆస్పత్రిని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. నిర్వహణను పట్టించుకోకపోవడంతో పేదలకు వైద్యం దూరమవుతోంది. అత్యవసరమైనా ఆ ఆస్పత్రికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఈ పరిస్థితిని చూసిన రోగులతో పాటు వైద్య సిబ్బంది సైతం ఆందోళన చెందుతున్నారు.

మల్కాపురం: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులు అక్కడ పరిస్థితి చూసి వెనుతిరుగుతున్నారు. ఆస్పత్రి అంధకారంలో ఉండడంతో రావడానికి జంకుతున్నారు. పరిసరాల్లో ఆకతాయిలు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇదీ 60వ వార్డు గుల్లలపాలెంలోని 30 పడకల ఆస్పత్రి వద్ద దుస్థితి.

నాడు సంజీవనిలా సేవలు

పారిశ్రామిక ప్రాంతంలోని పేద ప్రజలకు ఈ 30 పడకల ఆస్పత్రి సంజీవనిగా నిలిచేది. 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో ఏ సమయంలో అనారోగ్యం వచ్చినా భరోసాతో వైద్యానికి వచ్చే వారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన బెంచీల వద్ద నిరీక్షించేవారు. రాత్రి అయినా ఎల్ఈడీ లైట్లు వెలుగు ఉండడంతో దర్జాగా ఉండే వారు. ఇదంతా గత ప్రభుత్వంలో మాట.

నేడు ఆకతాయిల అడ్డా .. ప్రస్తుతం ఈ ఆస్పత్రి ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి వేళ అంధకారం అలుముకోవడంతో రోగులు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం సమయంలో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటే చెట్ల కింద ఏర్పాటు చేసిన బెంచీల వద్ద రోగులు సేద తీరుతున్నారు. నాడు పరిసరాలు సుందరంగా కనిపించేందుకు ఆవరణ చుట్టూ సుమారు పదికి పైగా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్కలైటు కూడా వెలగడం లేదు. ఇదే అదునుగా భావిస్తున్న కొంత మంది ఆకతాయిలు ఆస్పత్రి ఆవరణలోకి చేరి ధూమపానం,మద్యం,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

వాచ్‌మన్‌పై దాడి

గత వారం ఆస్పత్రి ఆవరణలోకి వచ్చిన ఆకతాయిలను నైట్ డ్యూటీ చేస్తున్న వాచ్‌మన్ వీరబాబు ప్రశ్నించారు. దీంతో అతడిని బ్లేడ్‌తో గాయపరిచారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు


గుల్లలపాలెం ఆస్పత్రి

చేసినా ఫలితం లేదు. దీంతో రాత్రి సమయంలో ఎంతటి అత్యవసరమైనా రోగులు ఆస్పత్రికి రావడానికి భయపడుతున్నారు. మల్కాపురం పోలీసు అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రోగులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.

వాగ్దానాలు నిలబెట్టుకోవాలి


మాట్లాడుతున్న దేవర అప్పలరాజుయాదవ్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు అధిక శాతం ఉపాధి కల్పిస్తామని నాడు చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో వాగ్దానాలు చేసిన సంస్థ యాజమాన్యం వాటిని విస్మరించిందని వీపీసీఎల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవర అప్పలరాజు యాదవ్ విమర్శించారు. ఈ అంశంపై యూనియన్ సభ్యులు, పలువురు నిరుద్యోగ యువతతో 59వ వార్డు నక్కవానిపాలెంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తరణ పనులకు ముందు యాజమాన్య ప్రతినిధులు హెచ్‌పీసీఎల్‌ను ఆనుకుని ఉన్న ప్రజలపై, స్థానిక నిరుద్యోగులపై లేని ప్రేమ చూపి.. లేనిపోని వాగ్దానాలను చేసి, నేడు ఆ సమయం రాగానే స్థానికేతరులకు అధిక శాతం ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికుల కోసం కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ వారి మెప్పును పొందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని పీల్చి, దాని వల్ల రోగాల బారిన పడుతున్నది కూడా ఈ ప్రాంత వాసులేనని, జబ్బులు మాకు.. డబ్బులు ఇతర ప్రాంత వాసులకా అని ఆగ్రహించారు. యాజమాన్యం తన తీరు మార్చుకుని స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, లేకుంటే కార్మికులతో కలిసి ఉద్యమిస్తామని అప్పలరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఉత్సవాలకు ముహూర్తపు రాట

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల దుర్గాదేవి ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి పూజలు ఘనంగా చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు నిర్ణయించారు. దీనిలో భాగంగా నవరాత్రి పూజలకు సంబంధించిన ముహూర్తపు రాటను శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తొలుత గణపతి పూజ చేసి అనంతరం ముహూర్తపు రాట వేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దుర్గాదేవి నవరాత్రి పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో రూపంలో దర్శనమిస్తామని చెప్పారు. పూజా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు.

సెయిల్‌లో విలీనంతోనే స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్తు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తేనే భవిష్యత్తు ఉంటుందని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెయిల్ విలీనం చేయాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి కుమారస్వామి, కార్యదర్శులను కలిసి వివరించామన్నారు. ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడంతో పాటు సెయిల్‌లో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని, త్వరలో మంచి నిర్ణయం వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, బి.ఎస్. రాజు, అవతారం, సుబ్బయ్య, రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, మద్ది అప్పలరాజు, బి.టి. జగదీష్, డి. మోహన్, పి.వి. నగేష్, గోపాలరాజు, వేణువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు వెంటనే యాజమాన్యం నిర్వహించాలని స్టీల్‌ప్లాంట్ దళిత నాయకులు ఎస్. రమేష్‌కుమార్, డి. మోహన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉక్కునగరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అసోసియేషన్ ఎన్నికలు 2022 సెప్టెంబర్ 11న జరిగాయన్నారు. ప్రస్తుత అసోసియేషన్ రెండేళ్ల కాలపరిమితి ఈనెల 11తో ముగిసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే ఎన్నికల నిర్వహణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత కమిటీ నామమాత్ర కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కావాలని, కొత్త నిర్ణయాలు తీసుకోకుండా ఎస్సీ, ఎస్టీ సెల్ అధికారులు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో ఆర్. జగదీష్‌కుమార్, పి. సోమునాయుడు, సీహెచ్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మర్రిపాలెం : ఇటీవల వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడికి పాల్పడడంతో కంచరపాలెం పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేశారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సూర్యానగర్ వద్ద గురువారం రాత్రి వినాయక నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. ఈ సమయంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు నారాయణ, భూలక్ష్మి, అక్కునాయుడు, ఎస్పీ రమణ విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలో రాత్రి 10 : 30 గంటలు దాటిందని, నిబంధనలు అతిక్రమించకూడదని, సౌండ్ సిస్టమ్ ఆపాలని నిర్వాహకులను కోరారు. అయినా పట్టించుకోకుండా నిర్వాహకులు, స్థానిక యువకులు కలిసి చిందులేశారు. ఈ విషయమై పోలీసులు మరోసారి చెప్పడంతో సత్యనగర్ ప్రాంతానికి చెందిన నీలపు రమేష్ దురుసుగా ప్రవర్తించడంతో కానిస్టేబుల్ రమణ కింద పడిపోయారు. దీంతో అతను కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సత్యనగర్‌కు చెందిన నీలపు రమేష్‌ను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాజువాక సీఐ బాధ్యతల స్వీకరణ


పార్థసారథి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐగా ఎ.పార్థసారధి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మూడో పట్టణ లా అండ్ ఆర్డర్‌గా సీఐగా పనిచేస్తూ బదిలీపై గాజువాక సీఐగా విచ్చేశారు. గతంలో సీఐడీ, జీఆర్‌పీ సీఐగా, ఆనందపురం పీఎస్‌లో పని చేశారు. గాజువాక లా అండ్ ఆర్డర్ ఎస్ఐలతో సమావేశం నిర్వహించి లా అండ్ ఆర్డర్‌ను కఠినంగా అమలు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని సూచించారు.

ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రాం శీతాకాల ప్రవేశాలు ప్రారంభం

బీచ్‌రోడ్డు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ) ప్రోగ్రాం కోసం శీతాకాల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రోగ్రాం ద్వారా అభ్యర్థులకు సమగ్ర నిర్వహణ సామర్థ్యాలను అందించడమే లక్ష్యమని ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధునాతన మేనేజ్‌మెంట్ నైపుణ్యంతో పని చేసే నిపుణులను శక్తివంతం చేయడం లక్ష్యంగా టైమ్స్‌ప్రో సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాం వ్యూహాత్మక దూరదృష్టితో, విశ్వాసంతో ఆధునిక వ్యాపార చిక్కులను నేర్పుగా తొలగిస్తూ ముందుకు వెళ్లగల నాయకులను తయారు చేయడానికి రూపొందించిందని వెల్లడించారు. మార్కెటింగ్, ఆర్థికశాస్త్రం, ఫైనాన్స్, అకౌంటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మానవ వనరులు, వ్యూహాత్మక ఆలోచన, ఉత్పత్తి, ఆపరేషన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ఎథిక్స్, చట్టం తదితర అంశాలు ఈ ప్రోగ్రాంలో ఉంటాయని వివరించారు.

'యూ జీనియస్ 3.0' క్విజ్ పోటీల విజేత డీపాల్

సీతంపేట: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో 8 నుంచి 12 ఏళ్ల వయసు గల విద్యార్థులకు 'యూ జీనియస్ 3.0'నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటేషన్–2024 పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 116 పాఠశాలల నుంచి 435 బృందాలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానం, ప్రతిభా పాటవాలు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గుర్తించవచ్చన్నారు. ఈ పోటీల్లో డిపాల్ స్కూల్ విజేతగా, విశాఖ వ్యాలీ స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బహుమతులు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ రెండు జట్లు ముంబయిలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. గ్రాండ్ ఫినాలే విజేతకు రూ.2 లక్షలు, మొదటి రన్నర్‌కు రూ.లక్ష, రెండవ రన్నర్‌కు రూ.50 వేలు బహూకరిస్తారన్నారు. యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలిని మీనన్, డిప్యూటీ జోనల్ హెడ్‌లు దేవర శంకరరావు, శంకర్ హెంబ్రామ్, విశాఖ రీజనల్ హెడ్ నరసింహకుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల వాటర్ ట్యాంక్ తొలగింపు


వాటర్ ట్యాంక్ తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో శిథిలావస్థకు చేరుకున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం తొలగించారు. ఈ పనులను ఎమ్మెల్యే గణబాబు పర్యవేక్షించారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా ట్యాంక్‌ను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. పూర్తిస్థాయిలో దీన్ని తొలగించి నూతన టాంక్ నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దీపారాధనలు.. అన్నసమారాధనలు

వినాయక మండపాల వద్ద ఆధ్యాత్మిక సందడి


గొల్లవీధిలో దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్న యాదవ్ యూత్ ప్రతినిధులు


శ్రీహరిపురం వద్ద అన్న సమారాధనను ప్రారంభించిన పి.వి.సురేష్

మల్కాపురం: వినాయక నవరాత్రులను పారిశ్రామిక ప్రాంతంలో సందడిగా నిర్వహిస్తున్నారు. పలు వినాయకుడి మండపాల వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాలు,దీపారాధనలు శుక్రవారం నిర్వహించారు. 61వ వార్డు మల్కాపురం పల్లివీధిలో స్థానిక యువత ఆధ్వర్యంలోప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేపట్టారు. సాయి సమత ట్రస్టు ప్రతినిధి సమతయాదవ్ పాల్గొని దీపారాధనను ప్రారంభించారు.

- మల్కాపురం గొల్లవీధి వద్ద యాదవ్ యూత్ ప్రతినిధులు లక్షా ఒక్కటి దీపారాధన చేపట్టారు.
- 60వ వార్డు శ్రీహరిపురం,జవహర్‌నగర్ రోడ్డు, రెండు గుడుల వెనుక రైజింగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళుల ర్పిస్తున్న సీపీఎం నాయకులు


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గోపాలపట్నం: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యులు సంతాపం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. విశాఖలో బీహెచ్‌పీవీలో బీహెచ్ఈఎల్ విలీనంలో, హిందుస్తాన్ షిప్‌యార్డును రక్షణ రంగంలో విలీనం చేయడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీరావు, పి.వెంకటరెడ్డి, గోపాలపట్నం జోన్ నాయకులు ఉరుకూటి రాజు, ఎం.వి.ప్రసాదరవు, పి.అనసూయ, టి.నూకరత్నం, ఎ.గోవిందరావు, ఎస్.ప్రభావతి, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సేవలు చిరస్మరణీయం

మల్కాపురం: విద్యార్థి దశ నుంచే అనేక ఉద్యమాల్లో పాల్గొని పేద ప్రజలకు అండగా నిలిచిన మహనీయుడు దివంగత నేత సీతారాం ఏచూరి అని సీపీఎం నాయకుడు పైడిరాజు అన్నారు. సీతారాం ఏచూరి సంతాప సభను మల్కాపురం దరి వెంకన్నపాలెంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కష్టం అంటే వెంటే ఉండి వారి సమస్యలపై పోరాడిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. సామాన్య వ్యక్తి నుంచి సీపీఎం జాతీయ కార్యదర్శిగా,రాజ్యసభ సభ్యునిగా ఆయన ఎదిగారన్నారు. ఆయన మరణం ఇటు పార్టీకి,అటు ప్రజలకు తీరని లోటు అని వివరించారు.

కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం


ఆరోగ్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎండీ హేమంత్ ఖత్రీ

మల్కాపురం: ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల ఆరోగ్యానికి హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అధిక ప్రాధాన్యమిస్తోందని సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ అన్నారు. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్(ఈఎస్ఐ) సహకారంతో షిప్‌యార్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికులకు వార్షిక ముందస్తు ఆరోగ్య తనిఖీ శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శిబిరంలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. 400 మంది కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన శిబిరం ఈ నెల 20 వరకు కొనసాగుతుందని ఈఎస్ఐ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్, ఈఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విశ్వేశ్వరయ్య ఆదర్శం


ఇంజినీర్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఈ చిరంజీవి

గోపాలపట్నం: నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జీవీఎంసీ ఈఈ సోరుపిల్లి చిరంజీవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ఇంజినీర్‌గా దేశానికి చేసిన సేవ ఎంతో గొప్పదని కొనియాడారు. నేటి తరం విద్యార్థులకు ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ప్రతాప్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి యు.అరుణ్‌కుమార్, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ అధికారి రాధికకు సత్కారం


అవార్డు గ్రహీత రాధికను సత్కరిస్తున్న హెచ్‌ఆర్ అధికారులు, సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ దాసరి రాధికను శుక్రవారం హెచ్‌ఆర్ అధికారులు, సిబ్బంది సత్కరించారు. ఇటీవల ఆమె న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మక జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈడీ (వర్క్స్) బిల్డింగ్ హెచ్‌ఆర్ కాన్ఫరెన్స్ హాలులో హెచ్‌ఆర్ అధికారులు, సిబ్బంది ఆమెను అభినందించారు. ప్లాంట్ పర్సనల్ జీఎం ఎస్. భాను మాట్లాడుతూ హెచ్‌ఆర్ అధికారిగా డాక్టర్ రాధిక అందించిన సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. సన్మాన గ్రహీత రాధిక మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ అధికారులు వి. అరుణ, సైగల్, ఖర్, మురళీమోహన్, వి.ఎల్.పి. లాల్, బి. జోగారావు పాల్గొన్నారు.